



# కరపత్రం

SINCE 2014

మంగళవారం ఆగస్ట్ 04, 2026 | సంపుటి : 2 | సంచిక : 293 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




## తెలంగాణలో పలు జిల్లాలకు భారీ వర్ష సూచన

**హైదరాబాద్:**
క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్ష సూచన ఆదిలాబాద్, ఖమ్మం, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.



# రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు

### నిమ్స్ వైద్య బృందానికి సిఎం రేవంత్ రెడ్డి అభినందనలు

**హైదరాబాద్,ఆగస్ట్3 :**
నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించినందుకు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరిందన్నారు. నిమ్స్‌లో ఇప్పటివరకు నిర్వహించిన రొబోటిక్ సర్జరీల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా నిర్వహించడం ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమని అన్నారు. ఇటీవలే రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు వెయ్యి రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవటం ద్వారా కొత్త రికార్డు నెలకొల్పిందన్నారు. వైద్య రంగంలో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు సాధించాలని సీఎం ఆకాంక్షించారు

## వైభవంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు
- అన్ని శాఖల అధికారులను ఆదేశించిన సిఎస్



2 లో

**హైదరాబాద్,ఆగస్ట్3 :**
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా, గౌరవప్రదంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు.



### విద్యార్థులపై నమోదైన

## కేసులు వెనక్కి

- ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు
- సుప్రీంకోర్టుకు వివరించిన కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ,ఆగస్ట్3 :**
జంతర్‌మంతర్ వద్ద గత నెలలో విద్యార్థుల ఆందోళనల సందర్భంగా నమోదైన ఎఫ్ఐఆర్ ల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది.

2 లో



2 లో

## లాల్‌దర్వాజ బోనాలకు అన్ని ఏర్పాట్లు

- జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కార్డులు
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**హైదరాబాద్,ఆగస్ట్3 :**
లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటనలు చేశారు. జోగినిలకు ప్రత్యేక గుర్తింపు, గుర్తింపు కార్డుల జారీతో పాటు భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## నిజామబాద్ జిల్లాలో ఆస్పత్రుల అభివృద్ధి

- » వైద్యరంగం బలోపేతం చేసే విధంగా చర్యలు
- » అధికారులతో సమీక్షించిన మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్,ఆగస్ట్3 :**
నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల మౌలిక వసతుల అభివృద్ధి, కొత్త భవనాల నిర్మాణం, వైద్య పరికరాల అందుబాటు, అవసరమైన సిబ్బంది నియామకం, పెండింగ్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి దామోదర



మిగతాది 2లో

## సాంకేతిక విద్యపై సీఎం సమీక్ష చేయలేదు: భాజపా ఎమ్మెల్యే పాల్వాయి



2లో..

**హైదరాబాద్:**
మేధావులు, విద్యార్థులను సీఎం రేవంత్ రెడ్డి అవమానిస్తున్నారని భాజపా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు విమర్శించారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌బాబు మాట్లాడారు.

## సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులే లక్ష్యం

### సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయపరమైన స్పష్టత

- రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా సద్వినియోగం చేసుకోవాలి
- పాలమూరు-రంగారెడ్డి, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు ప్రాధాన్యం
- సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో ప్రక్రియ పూర్తిచేయాలని లక్ష్యం
- 60 రోజుల్లో ప్రధాన పరిపాలనా, దరఖాస్తుల ప్రక్రియ పూర్తి
- గౌరవెల్లి పంప్‌హౌస్‌ను సర్వసన్నద్ధంగా ఉంచాలి
- అనుమతులు రాగానే సీతారామ సాగర్ పనులు పునఃప్రారంభించాలి
- తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణకు అంతర్రాష్ట్ర విభాగాన్ని బలోపేతం చేయాలి

2లో..





## కోమటిరెడ్డి రాజకీయ వైరాగ్యం

- ఆయన మాటలపై జిల్లా రాజకీయాల్లో చర్చ
- ఓటమి భయంతోనే ఈ వ్యాఖ్యలని బిఆర్ఎస్ విమర్శలు

**నల్లగొండ,ఆగస్ట్3 :**
నల్లగొండ జిల్లా రాజకీయాల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం తీవ్ర కలకలం రేపుతున్నాయి. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడంపై ఆయన స్పందిస్తూ తన మనసులోని మాటను బహిరంగంగా వెల్లడించారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని నల్లగొండ ప్రజలు మాట ఇస్తేనే తాను పోటీ చేస్తానని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల నుంచి అలాంటి గ్యారెంటీ లేదా హామీ లభించకపోతే తాను ఎన్నికల బరి నుంచి తప్పుకోవడానికి కూడా సిద్ధంగా ఉన్నానని వ్యాఖ్యానించారు.



## PKOC-2 కోల్‌బ్లాక్‌తో.. 2వేల మందికి ఉపాధి..

- » సింగరేణికి PKOC-2 కోల్‌బ్లాక్.. కిషన్ రెడ్డి హర్షం
- » PKOC-2 తో సింగరేణికి భారీ ఊరట
- » కోల్‌బ్లాక్‌తో తెలంగాణకు ఇంధన భద్రత: కిషన్ రెడ్డి
- » రూ.43 వేల కోట్ల ఆదాయం తెచ్చే PKOC-2 కోల్‌బ్లాక్
- » సింగరేణి భవిష్యత్‌కు PKOC-2 బలమైన పునాది
- » మూడు కోల్‌బ్లాక్‌లతో సింగరేణికి భారీ లాభాలు
- » సింగరేణికి మరో కీలక కోల్‌బ్లాక్ దక్కింది
- » PKOC-2 తో ఉద్యోగాలు.. ఆదాయం.. అభివృద్ధి

మిగతాది 2లో

## మహంకాళి ఆలయం వద్ద జోగినిలకు అవమానం

**హైదరాబాద్,ఆగస్ట్3 :**
ఉజ్జయిని మహంకాళి ఆలయంలో అధికారుల నిర్లక్ష్యంపై జోగిని శ్యామల ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరం వచ్చినప్పుడే జోగినిలను ప్రభుత్వం గుర్తు చేసుకుంటుందని ధ్వజమెత్తారు. బోనాల సందర్భంగా జోగినిలకు కనీస ఏర్పాట్లు కూడా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఆలయ సిబ్బంది జోగినిలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

- జోగినిలను అడ్డుకోవడంపై ఆలయం ముందు ఆందోళన
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండిపడ్డ జోగిని శ్యామల



మిగతాది 2లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం ఆగస్ట్ 04, 2026

# వైభవంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

మొదటిపేజీ తరువాయి

సోమవారం సచివాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించి వివిధ శాఖల అధికారులతో సిఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ప్రాధాన్యత కలిగినవని, దేశ స్వాతంత్ర్య స్ఫూర్తికి తగిన విధంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ముందుగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లోని సైనిక్ స్మారక్ వద్ద అమరవీరులకు పుష్పాంజలి ఘటిస్తారని, అనంతరం హైదరాబాద్ గోల్కొండ కోటలోని రాణీ మహల్ లాన్స్‌లో నిర్వహించే ఈ వేడుకలకు హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించి, ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని సిఎస్ తెలిపారు. వేడుకల నిర్వహణకు సంబంధించి అన్ని శాఖలు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని ఆయన ఆదేశించారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వేదిక ఏర్పాటు, సిట్టింగ్ ఇతర సౌకర్యాలు, అత్యవసర సేవలు తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ÷రిలిడ్లు, భవనాల శాఖ వేదిక నిర్మాణం, స్టేజ్, సిట్టింగ్ ఏర్పాట్లు, బ్యారికేడింగ్, రహదారుల మరమ్మతులు, తదితర మౌలిక సదుపాయాల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీసు శాఖ భద్రతా, ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టడంతో పాటు వీఐపీలు, పాల్గొనేవారి రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అధికారులు వేదిక పరిసరాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సుందరీకరణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ తగిన సంఖ్యలో వైద్య బృందాలు, అంబులెన్సులు, ప్రాథమిక చికిత్స కేంద్రాలను వ్యూహాత్మక ప్రాంతాల్లో అందుబాటులో ఉంచాలని, అగ్నిమాపక శాఖ అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ÷ర్ టెండర్లు, అత్యవసర బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, బ్యాకప్ ఏర్పాట్లను చేపట్టాలని సిఎస్ ఆదేశించారు. ఇతర శాఖలు కూడా తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి, అన్ని పనులను వేడుకలకు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ క్రమం తప్పకుండా క్షేత్రస్థాయి తనిఖీలు, సమీక్షలు నిర్వహించాలని, రాష్ట్ర ప్రతిష్ఠను చాటే విధంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా, గౌరవప్రదంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, వాణి ప్రసాద్, జీఏడీ (పొలిటికల్) ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్, హోంశాఖ ప్రధాన కార్యదర్శి శిఖా గోయెల్, డీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, హైదరాబాద్ పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనార్, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, సమాచార / పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లాల్‌దర్వాజ బోనాలకు అన్ని ఏర్పాట్లు

మొదటిపేజీ తరువాయి

ఈ రోజు తెలంగాణ ప్రజలందరికీ శుభదినమని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతర కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఈసారి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కొంత ఒత్తిడి ఏర్పడినా, దర్శనాలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేశారని చెప్పారు. జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలని వారు కోరిన విషయాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో జోగినిలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, వారికి గుర్తింపు కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. అలాగే మున్సిపల్ ఎన్నికల్లో వారిని కో-ఆప్షన్ సభ్యులుగా
తీసుకునే దిశగా కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. అమ్మవారికి సేవ చేసే వారికి మూడు శాఖల సమన్వయంతో లాల్‌దర్వాజా బోనాల సందర్భంగా మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తామని, జోగినిలకు అధికారిక గుర్తింపు కల్పించే అంశంపై సంబంధిత మంత్రితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# పోలవరం బ్యాక్‌వాటర్‌పై ముందస్తు అప్రమత్తత

## అధికారులకు మంత్రి ఉత్తమ్ సూచన

పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ కారణంగా తెలంగాణలోని ప్రాంతాలపై పడే సంభావ్య ప్రభావాన్ని కూడా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ విస్తృతంగా సమీక్షించారు. భూములు, గ్రామాలు, నివాస ప్రాంతాలు, ప్రజా మౌలిక వసతులు, ఇతర ఆస్తులు ఎంతవరకు ముంపునకు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందో నిర్ధారించేందుకు శాస్త్రీయ అధ్యయనం చేపట్టాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ÷లంగాణ వాదన కేవలం అంచనాలపై కాకుండా విశ్వసనీయమైన క్షేత్రస్థాయి సమాచారం, సాంకేతిక అధ్యయనాలు, సమగ్ర ఆర్థిక అంచనాలపై ఆధారపడి ఉండాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, సంబంధిత ఇతర సంస్థల వద్ద రాష్ట్ర ప్రయోజనాలను దృఢంగా వినిపించాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయి పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలోపే ఉమ్మడి ఖమ్మం జిల్లాపై బ్యాక్‌వాటర్ ప్రభావం ఎంతవరకు ఉంటుందో తెలంగాణ ప్రభుత్వం స్పష్టంగా అంచనా వేసి, సంబంధిత సంస్థల ముందు ఉంచాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పోలవరం ముంపు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావంతో నష్టపోయే భూములు, మౌలిక వసతులు, ఇతర ఆస్తులకు పరిహారం చెల్లించాల్సిన బాధ్యత సంబంధిత కేంద్ర సంస్థలదేనని సమావేశంలో స్పష్టం చేశారు. శాఖల మధ్య సమన్వయ సమావేశాలు నిర్వహించి, పెండింగ్ అంచనాలను త్వరగా పూర్తి చేసి, తెలంగాణకు సంబంధించిన పరిహార దావాలను అధికారికంగా సమర్థ సంస్థల ముందు ఉంచాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సమావేశంలో ఇంజినీర్-ఇన్-చీఫ్ (జనరల్) ఓ.వీ. రమేష్‌బాబు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, ఇంజినీర్-ఇన్-చీఫ్ (అడ్మిన్) పి.శ్రీనివాస్, ఇంజినీర్-ఇన్-చీఫ్ (ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్) ఆర్.మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల కేసు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట

## ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించిన ఢిల్లీ కోర్టు

మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ మాజీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట దక్కింది. ఈ కేసులో ఆయనను నిర్దోషిగా ప్రకటిస్తూ రౌజ్ అవెన్యూ కోర్టు అదనపు ప్రధాన న్యాయమూర్తి అశ్విని పన్వార్ సోమవారం తీర్పు వెలువరించారు. ఈ కేసులో మరో నిందితుడైన డబ్ల్యూఎఫ్ఐ మాజీ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌ను కూడా కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడం, బాధితులు ఇచ్చిన వాంగ్మూలాల్లో వ్యత్యాసం కారణంగా కోర్టు ఈ కేసును కొట్టేసింది. ఆరుగురు మహిళా రెజ్లర్లు చేసిన ఫిర్యాదుల ఆధారంగా బ్రిజ్‌భూషణ్‌పై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం 2023 జూన్ 15న మహిళల గౌరవానికి భంగం కలిగించడం, లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడినట్లు పలు సెక్షన్ల కింద ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. 2024 మే 10న ట్రయల్ కోర్టు ఐదుగురు మహిళా రెజ్లర్లకు సంబంధించిన ఆరోపణలపై బ్రిజ్‌భూషణ్‌పై అభియోగాలు నమోదు చేసింది. ఇద్దరు రెజ్లర్లను బెదిరించిన ఆరోపణలపైనా విచారణ కొనసాగింది. అలాగే ఒక మైనర్ రెజ్లర్ కూడా ఆరోపణలు చేసినప్పటికీ, అనంతరం ఆమె ఫిర్యాదును ఉపసంహరించుకోవడంతో పోక్సో చట్టం కింద నమోదైన కేసును పోలీసులు రద్దు చేశారు. తాజా తీర్పుతో బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్, వినోద్ తోమర్ ఇద్దరూ ఈ కేసులో నిర్దోషులుగా విడుదలయ్యారు. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడం, బాధితులు ఇచ్చిన వాంగ్మూలాల్లో వ్యత్యాసం కారణంగా కోర్టు ఈ కేసును కొట్టివేసింది.2016-2019 మధ్యకాలంలో తాము లైంగిక వేధింపులు ఎదుర్కొన్నామంటూ 2023లో మహిళా రెజర్లు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనలు చేపట్టడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనమైంది. నాటి సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ , ఇతర సభ్యులపై వారు ఈ ఆరోపణలు చేశారు. ఈ నిరసనల్లో స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, సాక్షి మాలిక్, బజరంగ్ పునియా తదితరులు పాల్గొన్నారు. కేంద్రం జోక్యంతో వారు మధ్యలో నిరసనలు విరమించారు. అయితే తగిన చర్యలు తీసుకోవట్లేదని ఆరోపిస్తూ ఆరుగురు రెజ్లర్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. మరోసారి నిరసనలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా పార్లమెంట్ కొత్త భవనంవైపు మార్చ్ చేపట్టగా.. వారిని పోలీసులు అడ్డుకోవడం, వారిని ఈడ్చుకెళ్లిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ కూడా తీవ్రంగా స్పందించింది. ఆరుగురు మహిళా రెజ్లర్లు చేసిన ఫిర్యాదు ఆధారంగా బ్రిజ్‌భూషణ్‌పై కేసు నమోదైంది. పోలీసులు అభియోగాలు దాఖలు చేశారు. ఆ ఆరుగురిలో వినేశ్ ఫొగాట్ కూడా ఉన్నారు. ఆ విషయాన్ని మూడు నెలల క్రితం ఆమె వెల్లడించారు. లైంగిక వేధింపుల బాధితుల గుర్తింపును పరిరక్షించేలా సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఇంతకాలం తన గుర్తింపును బయటపెట్టలేదని వెల్లడించారు. అంతకుముందు మైనర్ రెజ్లర్ ఒకరు తాను చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవడంతో పోక్సో కేసులో సింగ్ ఇప్పటికే నిర్దోషిగా తేలారు. ఇక నేటి తీర్పుతో ఆయనపై క్రిమినల్ విచారణ ముగిసినట్లయింది. తొలినుంచి బ్రిజ్ భూషణ్ తనపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చారు. ఆ ఆరోపణలు నిజమని తేలితే.. నేను ఉరివేసుకుంటానని తొలిరోజే చెప్పాను. నేడు నేను నిర్దోషిగా తేలినందుకు ఎంతోసంతోషంగా ఉందని తీర్పు అనంతరం సింగ్ వ్యాఖ్యానించారు.

# ఎపి రైతులకు ప్రభుత్వం శుభవార్త ఖరీఫ్ పంటల బీమా గడువు పొడిగింపు

రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఖరీఫ్ పంటల బీమా గడువును పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఖరీఫ్ పంటలకు బీమా నమోదు గడువును మరో 15 రోజులు పొడిగించినట్లు స్పష్టం చేసింది. జులై 31వ తేదీతో ముగియాల్సిన గడువుకు మరో 15 రోజులపాటు అవకాశం కల్పించినట్లు వెల్లడించింది. ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, వర్షాభావం వల్ల పంట నష్టాలకు బీమా రక్షణ కల్పిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. రూ.1 ప్రీమియంతో అన్నదాతలకు పంటల బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఏపీ సర్కార్ వివరించింది. ఇప్పటికి కూడా నమోదు చేసుకోని రైతులు వెంటనే బీమా నమోదు చేసుకోవాలని సూచించింది. సాగు చేసిన ప్రతి ఎకరానికి బీమా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

# కోమటిరెడ్డి రాజకీయ వైరాగ్యం

మొదటిపేజీ తరువాయి

అంతేకాకుండా, రాబోయే ఎన్నికల్లో తాను స్వయంగా ప్రచారానికి రాకపోయినా, నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని, అందించిన సేవలను చూసి ఓట్లేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో చర్చగా మారాయి. అయితే ఓటమి భయంతోనే కోమటిరెడ్డి ముందే జాగ్రత్త పడుతున్నారని బిఆర్ఎస్ నేతలు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎలాగూ గెలవదని, మళ్లీ అధికారంలోకి రావడం కాదుకదా, ఒక్కో నేతకు డిపాజిట్లు కూడా దక్కవని వ్యాఖ్యానించారు. అయితే సుదీర్ఘకాలం పాటు ఎమ్మెల్యేగా, మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించినప్పటికీ తనకంటూ సొంత ఇల్లు లేదా అదనపు ఆస్తులేవీ లేవని ఈ సందర్భంగా కోమటిరెడ్డి తెలిపారు. తాను ఇప్పటికీ అద్దె ఇంట్లోనే ఉంటున్నానని, కేవలం పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమి మాత్రమే తనకు ఉందని వివరించారు. అధికారంలో ఉన్నా లేకున్నా తన జీవితం పూర్తిగా ప్రజాసేవకే అంకితమని, స్వార్థ రాజకీయాలకు తాను దూరమని పునరుద్ఘాటించారు.ఎస్ఎల్బీసీ సొరంగ మార్గాన్ని పూర్తి చేయడమే తన లక్ష్యమని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. ఎస్ఎల్బీసీ సొరంగం మార్గం ద్వారా రెండు పంటలకు నీరు ఇచ్చి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని పేర్కొన్నారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతంలో ప్రతి ఎకరానికి సాగునీరు అందజేస్తామని చెప్పుకొచ్చారు. కంచనపల్లి గ్రామాన్ని మోడల్‌గా అభివృద్ధి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. దోమలపల్లి గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసి ఈ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేస్తామని తెలిపారు. మూడేళ్లు నల్గొండ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. వారానికి రెండు రోజుల పాటు నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

# సాంకేతిక విద్యపై సీఎం సమీక్ష చేయలేదు:

మొదటిపేజీ తరువాయి

"సీఎం ఎందుకు నోరు పారేసుకుంటున్నారో అర్థం కావడం లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో ఉన్న కోపం ఇంజినీరింగ్ విద్యార్థులపై చూపినట్లు అనిపిస్తోంది. వైఎస్ హయాంలో ఇబ్బడిముబ్బడిగా ఇంజినీరింగ్ కళాశాలలకు అనుమతి ఇచ్చింది నిజం కాదా?సాంకేతిక విద్యపై సీఎం ఒక్కసారి కూడా సమీక్ష చేయలేదు. విద్య, పురపాలక శాఖలను తన వద్దే పెట్టుకుని సీఎం విఫలమయ్యారు" అని హరీశ్‌బాబు విమర్శించారు.

# ఎన్‌కౌంటర్‌లో కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ హతం తుపాకీ లాక్కుని పారిపోతుండగా కాల్పులు

ఝార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ హతమయ్యాడు. పోలీసుల తుపాకీ లాక్కుని పారిపోతుండగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో గ్యాంగ్‌స్టర్ సుజిత్ సిన్హా మరణించాడని పోలీసులు తెలిపారు. సాహిబ్‌గంజ్ డివిజనల్ జైలుకు అతడిని తరలిస్తుండగా శనివారం రాత్రి ఈ ఘటన జరిగిందని చెప్పారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ధన్‌బాద్ జైలు నుంచి సాహిబ్‌గంజ్ మండల్ జైలుకు తరలిస్తుండగా సాహిబ్‌గంజ్ హైవేపై ఈ ఘటన జరిగింది. నాలుగు పోలీసు వాహనాల ఎస్కార్ట్‌తో అతడిని పోలీసులు తరలించారు. అయితే, జమ్‌తారా పోలీస్ స్టేషన్ పరిధిలోకి కాన్వాయ్ వచ్చేసరికి తాను మరుగుదొడ్డికి వెళ్లాలని అతడు కోరాడు. వాహనాలు ఆపిన సమయంలో అతడు తుపాకీ లాక్కుని చీకట్లోకి పారిపోయేందుకు ప్రయత్నించాడని పోలీసులు తెలిపారు. తమపై కాల్పులు కూడా జరిపాడని అన్నారు. స్వీయరక్షణ కోసం తామూ కాల్పులు జరపాల్సి వచ్చిందని చెప్పారు. అతడు ఘటనా స్థలంలోనే మరణించినట్టు అక్కడికి వచ్చిన మెడికల్ టీమ్ ప్రకటించింది. జమ్‌తారా ఎస్పీ శంభు కుమార్ సింగ్ ఆధ్వర్యంలో ఈ ఉదంతంపై దర్యాప్తు కొనసాగుతోంది. ఝార్ఖండ్‌లో సిన్హాపై అనేక కేసులు ఉన్నాయి. బలవంతపు వసూళ్లు, హత్య, హత్యాయత్నం తదితర కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. రాష్ట్రంలో తన ఇన్‌ఫ్లుయెన్స్‌ను కొనసాగించేందుకు పలు గ్యాంగులతో జట్లు కట్టి నెట్‌వర్క్‌ను నిర్మించుకున్నాడని పోలీసులు తెలిపారు.

# ప్రధాని మోడీపై మైనర్ బాలిక వ్యాఖ్యల కేసు క్షమించానని..కేసులతో వేదించమని ప్రధాని హామీ

నీట్ పేపర్ లీక్ ఆందోళనల్లో భాగంగా ప్రధాని మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన మైనర్ బాలికపై కేసును కొనసాగించబోమని ఢిల్లీ పోలీసు వర్గాలు స్పష్టం చేశాయి. ఈ ఘటనకు సంబంధించి నోయిడా పోలీసులు ఇటీవల జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆమె వ్యాఖ్యలు ప్రధాని పదవిని అగౌరవపర్చేలా, శాంతియుత పరిస్థితులకు భంగం కలిగించేలా ఉన్నాయంటూ అందిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదైంది. అయితే, ప్రస్తుతం ఆ కేసును బాలికపై కొనసాగించడం లేదని పోలీసులు వెల్లడించారు. తన కుమార్తెపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పోలీసులు వయసు 25 ఏళ్లుగా నమోదు చేశారని.. కానీ, ఆమె వయసు 15 ఏళ్లే అని తన తల్లి చెప్పిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ క్రమంలోనే బాలిక తల్లి తప్పు తెలుసుకుని ప్రధాని మోదీకి క్షమాపణలు చెప్పిన విషయం తెలిసిందే. తన కుమార్తెను క్షమించి గొప్ప మనసు చాటుకున్నారని ఆమె ప్రధానిని కొనియాడారు. 18 ఏళ్లలోపు పిల్లలకు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలను నిషేధించాలని ఆమె సూచించారు. చిన్నారులకు తెలియక సులభంగా ఇతరుల ప్రభావానికి లోనయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. వారి దృష్టి చదువులపైనే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జంతర్‌మంతర్ నిరసనల సందర్భంగా ప్రధానిని ఉద్దేశించి అసభ్యపదజాలంతో మాట్లాడిన బాలికపై కేసు పెట్టవద్దని ఢిల్లీ పోలీసులు నిర్ణయించినట్టు జాతీయ మీడియాలో కూడా కథనాలు వెలువడ్డాయి. ఈ ఉదంతానికి సంబంధించి తొలుత నోయిడా పోలీసులు జీరో
ఎఫ్ఐఆర్ ఫైల్ చేసిన విషయం తెలిసిందే. ఆ తరువాత ఢిల్లీ పోలీసులు ఈ ఉదంతంపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో బాలిక ప్రధానికి క్షమాపణ చెబుతూ వీడియో రిలీజ్ చేసింది. తనకు 15 ఏళ్లేనని, నిరసన వద్ద ఇతరుల ప్రభావానికి లోనై అలాంటి వ్యాఖ్యలు చేశానని వివరణ ఇచ్చుకుంది. ఇది తన చివరి తప్పిదమని కూడా చెప్పింది. ఈ క్రమంలో ప్రధాని మోదీ కూడా సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తప్పుదారి పట్టిన పిల్లలను క్షమించాలని అభిప్రాయపడ్డారు. వారిని శిక్షించడం, కోర్టుల చుట్టూ తిప్పడం వల్ల ప్రయోజనం ఉండదని అన్నారు.

# నిజామబాద్ జిల్లాలో ఆస్పత్రుల అభివృద్ధి

మొదటిపేజీ తరువాయి

ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నిజామాబాద్ ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. నిజామాబాద్ జిల్లాలో ఆరోగ్య సేవల పనితీరుపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సచివాలయంలో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో పాటు జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీ, జనరల్ ఆస్పత్రి పనితీరు, రోగులకు అందుతున్న వైద్య సేవలు సహా సిబ్బంది అందుబాటు, అత్యవసర సేవల నిర్వహణ వంటి అంశాలపై మంత్రి విస్తృతంగా చర్చించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు(సీహెచ్‌సీలు), సబ్ సెంటర్ల ద్వారా ప్రజలకు అందుతున్న సేవల నాణ్యత, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల విస్తరణపై అధికారులను ప్రశ్నించి అవసరమైన సూచనలు చేశారు. ఆరోగ్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా అధికారులు కృషి చేయాలని ఆయన స్పష్టం చేశారు.

# మహంకాళి ఆలయం వద్ద జోగినిలకు అవమానం

మొదటిపేజీ తరువాయి

పోలీసుల అత్యుత్సాహం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని జోగిని శ్యామల ఆగ్రహించారు. ఉదయం నుంచే గేట్ల వద్ద పోలీసులు జోగినిలను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా జోగినిలను అవమానించారని దుయ్యబట్టారు. ఆలయ కమిటీ జోగినిలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు కనీసం జోగినిలని అని కూడా చూడకుండా బయటకు ఎందుకు నెట్టేశారని ప్రశ్నించారు. జోగినిలకు గౌరవం, ప్రత్యేక ఏర్పాట్లు కల్పించాలని ప్రభుత్వాన్ని జోగిని శ్యామల కోరారు. ఈ క్రమంలో
ఉజ్జయిని మహంకాళి ఆలయం ముందు జోగినిలు సోమవారం ధర్నా చేపట్టారు. ఆదివారం బోనాల వేడుకల్లో జోగినిలను అవమానపరిచారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే జోగిని శ్యామలను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు జోగినిలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బ్యారికేడ్లు తొలగించుకుని మహంకాళి ఆలయంలోకి జోగినిలు ప్రవేశించారు. మహంకాళి ఆలయం ముందు జోగినిల ఆందోళనతో ఆలస్యంగా రంగం కార్యక్రమం ప్రారంభమైంది. జోగినిల ఆందోళనతో అమ్మవారి ఆలయం ముందు గందరగోళ వాతావరణం నెలకొంది. జోగినిలను చర్చలకు పిలిచి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండోమెంట్ ఉన్నతాధికారులు మాట్లాడారు. ఆందోళనను విరమించాలని జోగినిలను మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

# విద్యార్థులపై నమోదైన కేసులు వెనక్కి

మొదటిపేజీ తరువాయి

విద్యార్థులపై నమోదైన కేసులను ముందుకు తీసుకెళ్లబోమన్న తమ హామీకి కట్టుబడి ఉన్నామని ధర్మాసనానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ హామీని అత్యంత బాధ్యతగా అమలు చేయాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం, ప్రభుత్వం కోర్టుకు ఇచ్చిన హామీ కేవలం మాటల్లోనే కాకుండా ఆచరణలోనూ కనిపించాలని పేర్కొంది. గతంలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా విద్యార్థులపై అనవసరమైన చట్టపరమైన చర్యలు కొనసాగించకూడదని సూచించింది. విద్యార్థులపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఇప్పటికే సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్‌ల దర్యాప్తు అంశంపై వివాదం కొనసాగుతుండటంతో, ప్రభుత్వం తన హామీని ఎలా అమలు చేస్తుందనే అంశంపై కోర్టు దృష్టి సారించింది. ఇక విద్యార్థుల ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న సీజేపీ మాత్రం ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అన్ని ఎఫ్ఐఆర్‌లను పూర్తిగా ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తోంది. హామీలు అమలు కాకపోతే దేశవ్యాప్తంగా మళ్లీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది.

# PKOC-2 కోల్‌బ్లాక్‌తో.. 2వేల మందికి ఉపాధి..

మొదటిపేజీ తరువాయి

PKOC-2 డిప్‌సైడ్ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం చాలా సంతోషకరమైన విషయమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులకు అభినందనలు తెలిపారు. ఢిల్లీలో ఈ రోజు (సోమవారం) ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ డిప్ సైడ్ బ్లాక్ వల్ల సుమారు 180 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వులు ఉన్నాయని తద్వారా సంవత్సరానికి 6 మిలియన్ టన్నుల చొప్పున 25 ఏళ్లపాటు ఈ మైన్ నడుస్తుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.PKOC-2 కోల్‌బ్లాక్ వల్ల దాదాపు 2వేల మందికి ఉద్యోగకల్పన జరుగుతుందని ఇక్కడ దొరికే G-8 (మంచి క్వాలిటీ) బొగ్గు కారణంగా.. మొత్తం రూ.43వేల కోట్లకు పైగా రెవెన్యూ జనరేట్ అవుతుందని పేర్కొన్నారు. తదనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.10,500 కోట్లకు మించి ఆదాయం కూడా లభిస్తుందని తెలంగాణ ఇంధన భద్రతకు భరోసా దక్కడంతోపాటుగా.. సింగరేణి భవిష్యత్ అభివృద్ధికి అవసరమైన వనరులు లభిస్తాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## నైని, తాడిచర్ల-2,PKOC-2 డిప్‌సైడ్ బ్లాక్ వల్ల కలిగే ఉపయోగాలు

- సింగరేణికి 860 మిలియన్ టన్నుల రిజర్వ్ సమకూరుతాయి.
- 6,500 మందికి జీవనోపాధి లభిస్తుంది.
- సగటున 35 ఏళ్లపాటు ఏడాదికి 22 మిలియన్ టన్నుల చొప్పున ఉత్పత్తి చేయవచ్చు.
- ఈ 3 బ్లాక్స్ వల్ల సింగరేణికి రూ.1,95,510 కోట్లకు పైగా రెవెన్యూ వస్తుంది.
- రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపుగా రూ.48వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుంది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం ఆగస్ట్ 04, 2026

## శుక్రవారం పూజా ముగ్గు..

# అణుశక్తి సింబల్ ఒకటే

శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

- శుక్రవారం పూజ ముగ్గు..
అణు శక్తి సంకేత ముగ్గు ఒక్కటే.
- విశ్వశక్తిని, ముగ్గు లోనికి ఆహ్వానించి అమ్మవారిని ఆరాధించే విధానం శుక్రవారం పూజ.
- మనకు తెలిసినా, తెలియకున్నా శుక్రవారం పూజలోని శక్తి మనకు ఈ పూజ ద్వారా అందుతుంది.
- పూజ పూర్తి అయిన తర్వాత అయ్యగారు ముగ్గను మొత్తం తడిపి కలిపి విశ్వశక్తి అమ్మ వారి దయ మనతోనే ఉండాలని నుదురు పైన బొట్టుగా పెడతాడు
- శుక్రవారం పూజ ను ఒక ఆచారంగా, కూడా ఆనవాయితీగా జరుపుకునే ప్రతి వారికి శుభాలు చేకూరతాయి. అయితే ఆ పూజను సంస్కరించి శాస్త్రీయంగా జరుపుకునే హేతుబద్ధ విధానాలను మనము ఆచరించే ప్రయత్నం చేయాలి.
- జానపదులకు, సామాన్య ప్రజలకు శుక్రవారం పూజ అంటే ఒక మజా... శుక్రవారం పూజలో మద్యం మాంసం సమృద్ధిగా లభిస్తుందని అందరికీ తెలుసు.
- ఆర్థిఆర్థికంగాలంగా ఉన్నవారు శుక్రవారం పూజను ఆడంబరంగా జరుపుకుంటే, బీదలు తమ శక్తి మేరకు జరుపుకుంటారు.

ఏ రకంగా జరుపుకున్న శుక్రవారం పూజలో లభించే మత్తు,తన్మయత్వం ఒక్కటే. పూజ జరుపుకునే వారందరికీ శక్తి స్వరూపిణి అమ్మవారి అనుగ్రహం ఒక్కటే.
హిందూ సనాతన ధర్మం లో దైవ దర్శనం, సత్య దర్శనం అనేది పరమోన్నత ఆశయం.

- సామాన్య ప్రజలు ఆ దైవదర్శనాన్ని, ఆ సత్యాన్ని, పరమోన్నత ఆశయాన్ని పొందడానికి మత్తును ఆశ్రయిస్తారు.మనం జరుపుకునే మధ్య మాంసాలతో కలిసిన శుక్రవారం పూజ తామస పూజ కిందికి వస్తుంది.

**మద్యంతో మత్తులోకి జారుకున్న భక్తులు దేవదేవతలను సనాతన, నిత్య నూతన రూపాలుగా వర్ణిస్తూ పాటలు పాడుతూ తాగుతూ ఆనందాన్ని పొందుతారు. యోగులు పొందే సచ్చితానందాన్ని ఈ మద్యం మత్తుతో అనుభూతి చెందుతారు.**

- మనందరికీ శుక్రవారం పూజ అంటే తెలుసు..
ఆ పూజా విశిష్టత గురించి తెలుసుకుందాం.

మద్యం మాంసం ప్రధాన పాత్ర పోషించే శుక్రవారం పూజ శాస్త్ర లోతుల్లోకి వెళదాం. శుక్రవారం పూజలోని శాస్త్రీయతను తెలుసుకుందాం.
శుక్రవారం పూజ శాస్త్రీయమైనది. మనకు తెలియదు అంత మాత్రాన అది అశాస్త్రీయం కాదు.

తెలియని విషయాలను తెలుసుకోవడమే హేతుబద్ధత.
పూజా విధానాన్ని సవరించి, ఈ జగత్తుకు తల్లి అయిన అమ్మలగన్న అమ్మను సరైన రీతిలో పూజించుకోవడం చేయాలి.
భగవద్గీతలోని శ్రద్ధాత్రయ విభాగ యోగం,అధ్యాయం 17, శ్లోకం 4 లో శ్రీకృష్ణ పరమాత్ముడు మనుషుల స్వభావాన్ని బట్టి వారు చేసే పూజలు, ఆరాధనలను మూడు రకాలుగా విభజించారు. దీనికి సంబంధించిన ప్రధాన శ్లోకం.

**యజంతే సాత్త్వికా దేవాన్ యక్షరక్షాంసి రాజసాః
ప్రేతాన్ భూతగణాంశాన్యే యజంతే తామసా జనాః
అర్థం**

- సాత్విక గుణం గలవారు దేవతలను..
రాజస గుణం గలవారు యక్షులను..
తామస గుణం గలవారు భూతగణాలను అంటే సకల జీవాలను పూజిస్తారు.

**సాత్విక,రాజస,తామస అనే మూడు పూజా విధానాల్లో,మనం జరుపుకునే శుక్రవారం పూజ తామస పూజా విధానం లోనికి వస్తుంది.**
శుక్రవారం పూజలో “ముగ్గు” చాలా ప్రధానం. ఈ ముగ్గు పూజ పరమార్థాన్ని తెలియజేస్తుంది.
**శుక్రవారం ముగ్గు...అణుశక్తి ముగ్గు ఒక్కటే.**
శుక్రవారం పూజల్లో వేసే ప్రత్యేక ముగ్గులు,యంత్రాలు...
ఆధునిక అటామిక్ ఎనర్జీ సింబల్ ఒకేలా కనిపించడం వెనుక ఒక అద్భుతమైన విశ్వవ్యాప్త నిజం దాగి ఉంది.ఇది కేవలం కాకతాళీయం కాదు.శుక్రవారం ముగ్గు పూర్తిగా శాస్త్రీయమైనది. ఇది Atom...Cosmos మధ్య ఉండే శక్తి నిర్మాణ పోలిక.సూక్ష్మ పరమాణువు విశ్వానికి, స్థూల పదార్థ విశ్వానికి మధ్య ఉండే శక్తి నిర్మాణ పోలిక.

- పరమాణువు..atom కేంద్ర బిందువు మధ్యలో ప్రోటాన్లు, న్యూట్రాన్లు ఉండే అత్యంత శక్తివంతమైన న్యూక్లియస్.. కేంద్రకం ఉంటుంది. దీని చుట్టూ ఎలక్ట్రాన్లు తిరుగుతాయి.

**పూజా ముగ్గు యంత్రం మధ్యలో ఖచ్చితంగా ఒక చుక్క లేదా బిందువు పెడతారు.**

**శాక్తేయ సంప్రదాయం ప్రకారం ఈ బిందువు సమస్త విశ్వ సృష్టికి మూలమైన, అపరిమితమైన శక్తి కేంద్రం.**

**శక్తి తరంగాల ప్రసారానికి ఈ ముగ్గు ప్రధాన సంకేతం.**

- అటామిక్ సింబల్ కేంద్రకం నుండి వెలువడే అపారమైన శక్తి తరంగాలను .. Radiation/Energy orbits ను సూచించడానికి మూడు లేదా అంతకంటే ఎక్కువ లూప్‌లు,కక్ష్యలు కేంద్రం చుట్టూ గీస్తారు.




అటామిక్ సింబల్

శుక్రవారం పూజ అష్టదళం ముగ్గు

ప్రాంతాలవారీగా శుక్రవారం ముగ్గు మారుతూ ఉంటుంది

- అమ్మవారి ముందు వేసే పూజా ముగ్గు,యంత్రం లో బిందువు చుట్టూ త్రికోణాలు లేదా రేకులు కేంద్రీకృతమై ఉంటాయి.

**ఉగ్ర దేవతలు తామస తీవ్ర శక్తి”కి ప్రతీకలు. ఆ తీవ్ర శక్తిని .. High intensity energy ని ఒకే చోట కేంద్రీకరించడానికి లేదా నియంత్రించడానికి ఈ రేఖాగణిత ఆకృతులను వాడుతారు.**

జగజ్జనని అమ్మవారిని ముగ్గులోకి ఆహ్వానించి తమ ఇంటిలో శక్తిని నిలుపుకొని ఆరాధించడానికి ఈ ముగ్గు చాలా ప్రామాణికం.

**త్రికోణాల కలయిక -- సృష్టి, వినాశనం**
Creation & Destruction

పరమాణువును విచ్ఛిన్నం చేస్తే అపారమైన వినాశకర శక్తి వస్తుంది.అదే పరమాణువులను కలిపితే సృష్టికి మూలమైన శక్తి లభిస్తుంది.అమ్మవారి ముగ్గులలోని బోర్డ్ లేదా త్రికోణాలు కూడా ఇదే సూత్రాన్ని ప్రతిబింబిస్తాయి. దీనినే ఇంగ్లీష్ లో nuclear fusion అంటారు.
పైకి చూసే త్రికోణం శివుడిని (చైతన్యం), కిందకు చూసే త్రికోణం శక్తిని (భౌతిక శక్తి) సూచిస్తాయి. ఈ రెండింటి కలయికే పరమాణువులోని శక్తులు.

**పవిత్ర రేఖాగణితం,ఆధునిక విజ్ఞాన శాస్త్రం ప్రకారం విశ్వంలో అతి చిన్న పరమాణువు atom నుండి అతి పెద్ద గెలాక్సీల galaxies వరకు అన్నీ ఒకే రకమైన రేఖాగణిత పద్ధతిలో .. Geometric patterns నిర్మితమయ్యాయి. మన పూర్వీకులు ఈ సత్యాన్ని ముందే గ్రహించి, “యంత్రం” అనే పేరుతో శక్తులను ఆవాహన చేయడానికి ఈ భౌగోళిక ఆకృతులను ముగ్గులుగా మార్చారు.**

సైన్స్ పరంగా అణుశక్తి ..atomic energy అనేది పదార్థంలో దాగి ఉన్న అత్యంత శక్తివంతమైన రూపం.

ఆధ్యాత్మికంగా “అమ్మవారు అంటే విశ్వంలో ఉన్న పరమ శక్తి.
ఈ రెండూ ఒకే మూలాన్ని .. శక్తి సమతుల్యత మరియు తీవ్రతను సూచిస్తాయి కాబట్టే, వాటిని వ్యక్తపరిచే గుర్తులు symbols కూడా ఒకే రకమైన రేఖాగణిత రూపంలో కనిపిస్తాయి.
వేయి సంవత్సరాల విదేశీ దాడులలో, విదేశీ మతాల అరాచక పాలనలో మన భారతీయ సనాతన హైందవ ధర్మం ఆచార వ్యవహారాలు అనేక ఆటుపోట్లకు గురయ్యాయి. అణచివేయబడ్డాయి. ఈ పరాయి పాలనలో మన ధర్మాచరణ మార్మికంగా మారింది.
మన హైందవ సనాతన ధర్మం అజరామరమైనది. మనది సత్య ధర్మం. సత్యం ఎన్నటికీ నశించదు.ఆ సత్యశోధన ఎప్పటికీ ఆగిపోదు.
పరాయి మతాలకు చెందిన విదేశీయుల పాలనా కాలంలో మన హైందవ సనాతన ధర్మములో బోధనా వ్యవస్థ దెబ్బతిన్నది.
మన దేవాలయాలలో మన వేదాలు,మన వాంగ్మయం,మన చరిత్ర బోధించడం లేదు.
అలా బోధించడం ప్రారంభమైన నాడు, మన వేద ఘోష మారు మోగిన రోజు ప్రపంచంలోని అజ్ఞానమంతా తునా తునకలవుతుంది.
సనాతన ధర్మానికి చెందిన హిందువులు ఎవరికి వారు పూజ చేసుకొని దైవ అనుగ్రహాన్ని పొంది బతుకుతున్నారు. మనకు తెలియకుండానే మన పూర్వీకులు యోగులు అందించిన ఆచార వ్యవహారాలను మనము పాటిస్తున్నాము.
మనకు తెలియకపోయినా ఆ పూజలోని, ఆ ప్రార్థనలలోని ఫలితాన్ని మనం పొందుతున్నాము.
అమ్మవారి రూపాలు అనేకం. అందుకే భారతీయులు స్త్రీని తల్లిగా పూజిస్తారు.
**అష్టాదశ శక్తి పీఠాలు, అష్టలక్ష్ములు, నవదుర్గలు అమ్మవారి రూపాలు.
అమ్మవారి పూజ కూడా అనేక రూపాలు.**

**సామాన్యులు పూజించే గ్రామదేవతలు మొత్తం 101 మంది అక్కాచెల్లెళ్లు.
శ్రమ జీవులైన సామాన్యులు అమ్మవారిని గ్రామదేవతలుగా రకరకాల పేర్లతో పూజిస్తుంటారు.**

- పోచమ్మ,ఎల్లమ్మ,రేణుకా ఎల్లమ్మ,మైసమ్మ,పోలేరమ్మ,ముత్యాలమ్మ,పెద్దమ్మ,గంగమ్మ, గంగానమ్మ,అంకాలమ్మ,నూకాలమ్మ,మారమ్మ, బంగారమ్మ,సత్తెమ్మ,చిత్తారమ్మ,తలుపులమ్మ,మరిడమ్మ,పసుపులమ్మ,మాచలమ్మ,గొంతెమ్మ,తాళమ్మ,చింతాలమ్మ,కరువలమ్మ,కొండమ్మ,ఇరుకళమ్మ,ముత్యాలమ్మ,డొక్కాలమ్మ,ఈరమ్మ,పేరంటాలమ్మ,సోమలమ్మ,నువ్వులమ్మ,పులిమేరమ్మ ,గడిమైసమ్మ, గండిమైసమ్మ, కట్ట మైసమ్మ,ఉలవాలమ్మ,పండీలమ్మ,అద్దంకమ్మ.... ఇలా అమ్మవారిని ప్రతి చోట ప్రతివారు పూజిస్తూనే ఉంటారు.

**శుక్రవారం అమ్మవారిగా మనం పూజించే దుర్గమ్మ విశ్వశక్తికి సృష్టికి మూలం. శుక్రవారం తల్లి సర్వదేవతల స్వరూపం.**

సనాతన హిందువులకు ధర్మము గురించి తెలియకపోయినా,మన ఆచార వ్యవహార పూజా విధానాలతో మన ధర్మం నిరంతరం గంగలాగా ప్రవహిస్తూనే ఉంది.

- కేవలం శుక్రవారం పూజా విధానం ఒక్కటే కాదు. మన సనాతన హైందవ ధర్బములోని ప్రతి అనుసరణ కూడా శాస్త్రీయమైనది.

- ఒకరికి తెలియనంత మాత్రాన అది అశాస్త్రీయం కాదు.తెలుసుకోవడం ఫలితాన్ని పొందడం శాస్త్రీయత అవుతుంది. అది హేతుబద్ధం అవుతుంది.

మనిషి పుట్టుక నుండి చావు వరకు అన్ని జన్మ సంస్కారాలు కూడా శాస్త్రీయ పద్ధతిలోనే అందరము జరుపుకుంటాము. మనకు తెలియకపోయినా అది శాస్త్రీయమే.

**విమర్శించడం శాస్త్రీయత కాదు. హేతువాదం కాదు. అనాచారాలుగా మారిన వాటిలో శాస్త్రీయతను శోధించి సరి చేయడం హేతువాదమవుతుంది.**

మనం మరిచిపోయిన ఆచార వ్యవహారాలను సరిచేసి అందులో శాస్త్రీయత నింపడం హేతుబద్ధం గా మార్చడం మన భారతీయుల ముందున్న తక్షణ కర్తవ్యం.

- **సత్యం శివం సుందరం..**
- **మన సనాతన హైందవ ధర్మం సత్యం,**
- **ఆ సత్యం చైతన్యవంతమయినది,**
- **ఆ చైతన్యమే సుందరమైనది.**

సత్యశోధన వైపు నడిపించే శుక్రవారం పూజ విశిష్టత గొప్పది.

**భారత్ మాతాకీ జై**

# అన్ని వర్గాల సమస్యలు పరిష్కరించాలి

◆ఫీజు రియంబర్స్మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలి.
◆యువతకు ఇచ్చిన హామీలు అమలు పర్చాలి....
◆ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షులు పోలాడి రామారావు

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్:**
అన్ని వర్గాలకు ఇచ్చిన హామీల అమలులో నెరవేర్చడం లో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వైఖరి విడనాడాలని, పెండింగులో ఉన్న 10 వేల కోట్ల ఫీజు రియింబర్స్మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని ప్రజా సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు



ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల లో జాప్యం కారణంగా విద్యార్థుల పై చదువుల కోసం, ఉద్యోగాల దరఖాస్తుల నిమిత్తం ఆయా కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వక పోవడం తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సోమవారం కరీంనగర్ లోప్రజా సంఘాల నాయకుల తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశం లో పోలాడి రామారావు మాట్లాడారు.గతం లో లాగా పాత పద్ధతి లో విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయుటకు చర్యలు చేపట్టాలని కోరారు. మెస్ చార్జీలను పెంచాలని, ఖాళీగా ఉన్న వేలాది ఉద్యోగాలను భర్తీ చేయాలని విద్యార్థులకు, నిరుద్యోగులకు అన్నదాతలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యం వీడి ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు లేకుంటే పాలకులు మూల్యం చెల్లించుకోక తప్పదని పోలాడి రామారావు తీవ్ర స్థాయిలు హెచ్చరించారు.ఈ సమావేశంలో నాయకులు అందెం రమణారెడ్డి, దడిగల వెంకటేశ్వర్ రావు,ల్యాగల వీరారెడ్డి, అంచూరి సాధానందం, విక్రమ్ సింహా రావు తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండ్ భూముల్లో నిర్మాణ అనుమతులు

### సమగ్ర విచారణ జరపాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ పట్టణంలోని జగిత్యాల రోడ్డులో నూతన బస్టాండ్ నిర్మాణం కోసం భూసేకరణ చేసిన భూముల్లో నిర్మాణ అనుమతుల జారీపై వివాదం నెలకొంది. నిబంధనలకు విరుద్ధంగా కొందరికి మాత్రమే నిర్మాణ అనుమతులు మంజూరు చేశారని ఆరోపిస్తూ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, 9వ వార్డు కౌన్సిలర్ రామతీర్థపు మాధవి రాజు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గెజిట్‌ను ఆధారంగా చేసుకుని టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణ అనుమతులు మంజూరు చేస్తున్నారని, దీంతో భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె ఆరోపించారు. ఇప్పటికే జారీ చేసిన అనుమతులను రద్దు చేసి అందరికీ సమాన న్యాయం చేయాలని, గెజిట్‌పై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. బస్టాండ్ భూముల్లో నిర్మాణ అనుమతుల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో నిబంధనల ప్రకారమే అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

# వేదం ఉన్నత పాఠశాలలో నమూనా ఎన్నికలు

వేదం ఉన్నత పాఠశాలలో సోమవారం రోజున నమూనా ఎన్నికలు చాలా ఘనంగా జరిగాయి. మన భారత దేశ సాధారణ ఎన్నికల మాదిరిగానే విద్యార్థిని విద్యార్థులు నామినేషన్లు వేయడం, ఉపసంహరించుకోవడం, ఎన్నికల ప్రక్రియలు ఉన్నవారికి గుర్తులు కేటాయించడం , ప్రచారం చేయడం జరిగింది. ప్రతి విద్యార్థికి రాజ్యాంగం పట్ల ఎన్నికల విధివిధానాల పట్ల సంపూర్ణ అవగాహన కల్పిస్తూ ప్రతి సంవత్సరం వేదం ఉన్నత పాఠశాలలో ఈ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ బొమ్మ శ్రీనివాస్ గౌడ్ తెలియజేశారు. ఎన్నికలు ముగిసిన తర్వాత ఓట్ల లెక్కింపు గెలిచిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేయడం జరిగినది. సాధారణ ఎన్నికల మాదిరిగానే విద్యార్థులు చూపుడు వేలకు సిరా మరక పెట్టుకుని బ్యాలెట్ బాక్స్ లో ఓట్లు వేసి ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమం లో పాల్గొనడం జరిగింది. హెడ్ బాయి గా జాన్ వెస్లీ, హెడ్ గర్ల్ గా సనా, యాంటీ డ్రగ్ కమిటీ ప్రెసిడెంట్ , వైస్ ప్రెసిడెంట్, స్పోర్ట్స్ కమిటీ ప్రెసిడెంట్ , వైస్ ప్రెసిడెంట్ గా బొమ్మ శ్రీనివాస్ గౌడ్ ను ఎన్నుకోవడం జరిగింది.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఎన్సిసి కెడట్లతో ఘనంగా హరితహారం

మొక్కలు నాటడం మాత్రమే కాదు వాటిని పెంచి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దడం కూడా ప్రతి క్యాడట్ల ప్రాథమిక బాధ్యతని,మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో ఎన్సిసి క్యాడెట్లు ఆదర్శంగా నిలుస్తున్నారని, తెలుపుతూ క్రమశిక్షణ, సేవాభావం, సామాజిక బాధ్యతలకు ప్రతీకమైన ఎన్సిసి క్యాడెట్లు హరితహారాన్ని విజయవంతం చేయాలని , ప్రతి ఒక్కరికి చెట్ల పెంపకం గురించి సమాచారం ఇవ్వాలని గుర్తు చేస్తూ మొక్కలు నాటడం మాత్రమే కాదు వాటిని పెంచి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దే బాధ్యత కూడా ప్రతి క్యాడెట్ ప్రకృతిని కాపాడడం అంటే దేశాన్ని కాపాడమనే భావనతో ఎన్సీసీ కెడేట్లు సేవలందిస్తున్నారని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత, వి ఎన్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ వి. నరేందర్ రెడ్డి కొనియాడారు. హరితమే మన బలం - పర్యావరణమే మన సంపద, దేశభక్తితో పాటు ప్రకృతి భక్తిని కూడా పెంపొదిద్దాం అనే నినాదాలు చేసి ఆలోచింపచేశారు. చెట్లను పెంచడం వలన అనేక వనరులు మనకు కలుగుతాయని , అభివృద్ధి చోటు చేసుకుంటుందని చెప్పార

# లిఫ్ట్ పేరుతో దోపిడీ.. ఆరుగురు యువకుల అరెస్ట్

కరపత్రం ప్రతినిధి మెడ్చల్ మల్కాజ్‌గిరి, ఆగస్టు 3



లిఫ్ట్ ఇస్తామని నమ్మించి ద్విచక్ర వాహనదారుడిని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి కత్తితో బెదిరించి నగదు దోచుకున్న ఆరుగురు యువకులను అల్వాల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి దోపిడీకి ఉపయోగించిన కత్తితో పాటు నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.
పోలీసుల వివరాల ప్రకారం.. అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ద్విచక్ర వాహనదారుడికి లిఫ్ట్ ఇస్తామని చెప్పిన నిందితులు అతడిని నిర్మాణంలో ఉన్న నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లారు. అనంతరం కత్తితో బెదిరించి బాధితుడి వద్ద ఉన్న రూ.5 వేల నగదును లాక్కొన్నారు. అంతేకాకుండా, ఆన్‌లైన్ చెల్లింపు సేవ ద్వారా మరో రూ.800ను బలవంతంగా తమ ఖాతాకు బదిలీ చేయించుకుని అక్కడి నుంచి పరారయ్యారు.
బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలు, నిఘా దృశ్యాల సహాయంతో నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం వారిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేశారు. అపరిచితుల మాటలు నమ్మి లిఫ్ట్ తీసుకోవద్దని, నిర్మానుష్య ప్రాంతాలకు వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా లేదా ఇలాంటి ఘటనలు ఎదురైనా వెంటనే డయల్--100కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# “పూజిత” వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గం



కరపత్రం ప్రతినిధి నిజాంపేట్, ఆగస్టు 3
నిజాంపేట్ మున్సిపాలిటీ పరిధిలో గల పూజిత ఎనక్లేవ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ ఎన్నికలు ఆదివారం జరిగాయి. రసవత్తరంగా జరిగిన ఈ ఎన్నికలలో నువ్వా నేనా అన్న చందంగా అధ్యక్ష పదవికి పోటీ జరిగింది. ఈ కాలనీ లో సుమారు 850 కుటుంబాలు నివాసం ఉన్నారు. ఎన్నికల నిర్వహణ మాజీ అధ్యక్షుడు శరత్ , మాధవి మేడమ్ మరియు 5 గురు కమిటీ వారు చక్కగా నిర్వహించారు. ఈ ఎన్నికలలో అధ్యక్షుడిగా అనంతుల విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ రావు, సహాయ కోశాధికారిగా నాగార్జున కంభం (సిలికాన్ టవర్స్), ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్ రెడ్డి పట్లూరి. బొడ్డు నాగరాజ, సహాయ కార్యదర్శులుగా హరిబాబు కాటేపల్లి, వేగుళ్ల మరి అశ్వని జ్యోతి, కోశాధికారిగా ఎల్ కే నాయుడు,పీ ఆర్ఓ గా ఎం. నర్సింహా రెడ్డి ఎన్నికయ్యారు. కాలనీ వాసులు నా పైన నమ్మకంతో గెలిపించి నందుకు విద్యాసాగర్ కృతజ్ఞతలు తెలిపారు.

# హుజురాబాద్ పెద్దమ్మతల్లికి అరకిలో వెండి కిరీటం సమర్పణ

- రావనవేణి మురళి స్మారకార్థం కుటుంబ సభ్యుల భక్తి కానుక -- బోనాల ఉత్సవాలకు ఘన ఏర్పాట్లు

కరపత్రం ప్రతినిధి హుజురాబాద్, ఆగస్టు 3



హుజురాబాద్ పట్టణంలోని రంగనాయకుల గుట్టపై ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గత సంవత్సరం నిర్మించిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయానికి దివంగత రావనవేణి మురళి (ఎస్‌టీఓ) స్మారకార్థం ఆయన సతీమణి విమల, కుమారులు సాయిరాం, వంశీలు కలిసి అరకిలో వెండి కిరీటాన్ని భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు వేదమంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారికి వెండి కిరీటాన్ని సమర్పించి అలంకరించారు. అనంతరం ఆలయ కమిటీ, ముదిరాజ్ సంఘం సభ్యులు కిరీట దాతలను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆగస్టు 5న శ్రీ పోచమ్మతల్లికి బోనాలు సమర్పించి, ఆగస్టు 6న శ్రీ పెద్దమ్మతల్లి బోనాల మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, ముదిరాజ్ సంఘం సభ్యులు గుడ్డేలుగుల సమ్మయ్య, పోచయ్య, గోస్కుల సమ్మయ్య, వెంకన్న, కొలిపాక సమ్మయ్య, మౌటం శ్రీనివాస్, పిల్లి సమ్మయ్య, భూమ్ సాయికృష్ణ, రావనవేణి రాజేశం, రమేష్, భాస్కర్, బుర్రి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అసోంలో అమానవీయ ఘటన బాలికపై అత్యాచారం..దారుణ హత్య

అస్సాంలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. 15 ఏళ్ల బాలిక అత్యాచారానికి గురై, అతి దారుణమైన స్థితిలో ప్రాణాలు కోల్పోయింది. కుటుంబ సభ్యులే ఆమెను గుర్తించలేని స్థితిలో ఇంట్లో శవమై కనిపించిందని పోలీసు వర్గాలు వెల్లడించాయి. అస్సాంలోని హైలాఖాండీ జిల్లాకు చెందిన ఓ బాలిక కుటుంబ సభ్యులతో కలిసి సమీపంలోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లింది. అయితే తన కజిన్‌తో గొడవ కారణంగా తిరిగి ఇంటికి వచ్చేసింది. వేడుక అనంతరం వారు ఇంటికి వచ్చేసరికి తమ కుమార్తెను ఆ స్థితిలో చూసి హతాశులయ్యారు. హత్య చేయడానికి ముందు తమ బిడ్డపై అత్యాచారం జరిగిందని వారు ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమె తల, ముఖం గుర్తుపట్టలేని విధంగా ఛిద్రమైందని, వ్యక్తిగత అవయవాల్లోకి రాడ్డు చొప్పించారని పోలీసు వర్గాలు
వెల్లడించాయి. శవపరీక్ష అనంతరం లైంగికదాడి జరిగిందా లేదా అనేది తెలుస్తుందని, హత్యకు గల కారణాలపై స్పష్టత వస్తుందని పేర్కొన్నాయి. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ జాతీయ రహదారిని దిగ్బంధించారు. ప్రస్తుతం ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# కాకతీయ వైభవానికి కేంద్రం పెద్దపీట వేయాలి: వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

- కాకతీయ వారసత్వ పరిరక్షణ, అభివృద్ధి పై పార్లమెంట్ లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య

కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 3
వరంగల్ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన కాకతీయ వారసత్వ పరిరక్షణ, అభివృద్ధి అంశాన్ని లోక్‌సభ వేదికగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య బలంగా ప్రశ్నించారు. కాకతీయుల చరిత్ర, సంస్కృతి, కళా వైభవం కేవలం తెలంగాణకే కాకుండా దేశానికి గర్వకారణమని, అలాంటి వారసత్వ సంపదకు మరింత ప్రాధాన్యం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రధానంగా వరంగల్‌కు చరిత్రక గుర్తింపుగా నిలిచిన కాకతీయ కట్టడాలు, సంప్రదాయ కళలు, చేనేత– – హస్తకళలు, సాంస్కృతిక ఉత్సవాలు, పర్యాటక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గత మూడేళ్లలో ఎలాంటి చర్యలు తీసుకుందో వివరించాలని ఎంపీ డా.కడియం కావ్య కోరారు. ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సమాధానం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తెలంగాణలో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) పరిధిలో 9 రక్షిత కట్టడాలు ఉన్నాయని, వాటిలో వరంగల్ జిల్లాకు చెందిన కాకతీయ వారసత్వ కట్టడాలు కూడా ఉన్నాయని తెలిపారు.



అవసరాలు, నిధుల లభ్యత మేరకు వాటి పరిరక్షణ, నిర్వహణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ.. వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి, కాకతీయ కళా సంపద, చేనేత, హస్తకళలు, సాంస్కృతిక ఉత్సవాల అభివృద్ధికి ఇంకా విస్తృత స్థాయిలో చర్యలు అవసరమని అన్నారు. హెరిటేజ్ సిటీగా వరంగల్‌కు గుర్తింపు లభించి నప్పటికీ, నగరంలోని చారిత్రక కట్టడాల అభివృద్ధి పనులు మరింత వేగవంతం కావాలని డా. కడియం కావ్య అభిప్రాయపడ్డారు. వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి వద్ద ప్రపంచ స్థాయి పర్యాటక సదుపాయాలు కల్పిస్తే వేలాది మంది దేశ, విదేశీ పర్యాటకులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రసాద్ పథకం కింద రామప్ప దేవాలయ అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించడం సానుకూల పరిణామమే అయినప్పటికీ, కాకతీయ వారసత్వానికి సంబంధించిన అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసే ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను కేంద్రం రూపొందించాలన్నారు. కాకతీయుల చరిత్రను ప్రపంచానికి చాటిచెప్పేలా ప్రత్యేక సాంస్కృతిక, పర్యాటక ప్రాజెక్టులు చేపట్టాలని కోరారు.
వరంగల్ కోట అభివృద్ధికి ఏఎస్ఐ, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మధ్య ఒప్పందం కుదరడం స్వాగతించదగ్గ విషయమని, అయితే పనులు కాగితాలకే పరిమితం కాకుండా త్వరితగతిన పూర్తయ్యేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని సూచించారు. “కాకతీయుల వారసత్వం తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని, ఈ సంపదను పరిరక్షించడం, భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అన్నారు. వరంగల్ అభివృద్ధి, కాకతీయ వైభవ పునరుద్ధరణ కోసం పార్లమెంట్‌లోనూ, కేంద్ర ప్రభుత్వ స్థాయిలోనూ నిరంతరం తాను పోరాడుతానని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య స్పష్టం చేశారు.

# ఆగస్టు 7న నీట్ కౌన్సెలింగ్‌పై ఉచిత అవగాహన సదస్సు

- సద్వినియోగం చేసుకోవాలని
- విద్యార్థులు,తల్లిదండ్రుల కు నిర్వాహకుల పిలుపు

కరపత్రం ప్రతినిధి వరంగల్,ఆగస్టు 3
నీట్ లో అర్హత సాధించి ఎంబీబీఎస్,బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలు పొందాలనుకుంటున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించేందుకు మైనారిటీస్ ఇంటెలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఆగస్టు 7న ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించనున్నారు.శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు వరంగల్ నగరంలోని ఎంజీఎం ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఇస్లామియా కాలేజీలో ఈ కార్యక్రమం జరగనున్నట్లు ఫోరం ప్రతినిధులు తెలిపారు.ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన కౌన్సెలింగ్ నిపుణుడు పాల్గొని నీట్ కౌన్సెలింగ్‌లో అనుసరించాల్సిన విధానంపై విద్యార్థులకు సవివరంగా మార్గనిర్దేశం



చేయనున్నారు.కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్,వెబ్ ఆప్షన్ల నమోదు,ప్రభుత్వ,ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో సీట్ల కేటాయింపు విధానం,అవసరమైన ధ్రువపత్రాలు,సర్టిఫికెట్ల ధ్రువీకరణ,వివిధ కోటాల కింద ప్రవేశాల ప్రక్రియ,కౌన్సెలింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలను పూర్తిస్థాయిలో వివరించనున్నారు.అనంతరం విద్యార్థులు,తల్లిదండ్రులు అడిగే సందేహాలకు నిపుణుడు సమాధానాలు ఇవ్వనున్న ప్రత్యేక ప్రశ్నోత్తరాల కార్యక్రమం కూడా నిర్వహించనున్నారు.దీంతో కౌన్సెలింగ్ ప్రక్రియపై నెలకొనే సందిగ్ధతలు తొలగి,సరైన సమాచారం ఆధారంగా కళాశాలలు,కోర్సుల ఎంపికలో విద్యార్థులు మెరుగైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.నీట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు తమ తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులతో కలిసి ఈ సదస్సుకు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మైనారిటీస్ ఇంటెలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ అనీస్ సిద్ధిఖీతో పాటు మసూద్ మీర్జా మెహషర్,సయ్యద్ అక్బర్,ఎం.ఏ.నయీం,మహ్మద్ అమ్జద్ అలీ,నజ్నీన్ బేగం,తస్లీమ్,మొహమ్మద్ మషూక్ రబ్బానీ,ఖైర్ ఉల్ నసీరెన్,నజ్మా బేగం,తాహెరా,ఆమా,కుర్షో సలీం,నిఖత్,పర్వీన్ బేగం,మహ్మద్ జాఫర్,ఆసియా తదితరులు పాల్గొని విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించి పరిశ్రమను పరిరక్షించాలి

- టెస్కో పాలక మండలికి ప్రజాస్వామ్యయుత ఎన్నికలు నిర్వహించాలి: తాటిపాముల వెంకట్రాములు

కరపత్రం ప్రతినిధి వరంగల్, ఆగస్టు 3
రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించి చేనేత పరిశ్రమను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఒక ప్రకటనలో వెంకట్రాములు మాట్లాడుతూ.. చేనేత కార్మికుల సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి, త్రిఫ్ట్ ఫండ్ పథకానికి సంబంధించి 14 నెలలుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ వాటాను వెంటనే విడుదల చేయాలని, నేతన్న భరోసా రెండో విడత నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలకు సరఫరా చేసిన చేనేత ఉత్పత్తుల బిల్లులు, సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేసిన వస్త్రాల బకాయిలను టెస్కో వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు



దాటిన అనంతరం మరణించిన చేనేత కార్మికుల కుటుంబాలకు చేనేత బీమా బకాయిలు చెల్లించాలని, సహకార సంఘాల నగదు రుణాలను మాఫీ చేసి తిరిగి రుణ సౌకర్యం కల్పించాలని, చేనేత వస్త్రాల అమ్మకాలపై 20 శాతం రాయితీ పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. జియో ట్యాగ్ లేని నేతన్నలకు జియో ట్యాగ్ కల్పించడంతో పాటు, 50 ఏళ్లు దాటిన అర్హులైన చేనేత కార్మికుల దంపతులకు ఆసరా పింఛన్ మంజూరు చేసి, పింఛన్‌ను రూ.5 వేలుకు పెంచాలని డిమాండ్ చేశారు. నూలు, రంగులు, రసాయనాలు, ముడి సరుకులు, చేనేత వస్త్రాలపై వస్తు సేవల పన్నును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తామన్న హామీని అమలు చేయాలని, పావలా వడ్డీ రుణాలు అందించి కార్మికులకు నిరంతర ఉపాధి, గిట్టుబాటు కూలి కల్పించాలని కోరారు. ఇటీవల చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించిన ప్రభుత్వం, తెలంగాణ చేనేత సహకార సంఘం (టెస్కో) పాలక మండలికి కూడా ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికుల ఆందోళనలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# ఇంజనీరింగ్ విద్యార్థులను అవమానించడం దురదృష్టకరం: రాకేష్ రెడ్డి

- క్షమాపణ చెప్పకపోతే కొడంగల్‌లో లక్ష మంది విద్యార్థులతో నామినేషన్లు వేయిస్తామని హెచ్చరిక

కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 3
తెలంగాణ ఇంజనీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు, యువతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ.. భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా పేరొందిన సంస్థల్లో ప్రతిభ చాటుతూ రాష్ట్రానికి, దేశానికి గుర్తింపు తీసుకొస్తున్నారని, అలాంటి విద్యార్థులను “క్రిమినల్ వేస్ట్”గా అభివర్ణించడం అత్యంత బాధాకరమని అన్నారు.




ముఖ్యమంత్రిపై అనేక క్రిమినల్ కేసులు ఉన్నాయని ఆరోపిస్తూ, ఇంజనీరింగ్ విద్యార్థులపై విమర్శలు చేసే నైతిక హక్కు ఆయనకు లేదన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసిన రాకేష్ రెడ్డి, లేనిపక్షంలో కొడంగల్ నియోజకవర్గంలో లక్ష మంది ఇంజనీరింగ్ విద్యార్థులతో నామినేషన్లు దాఖలు చేయిస్తామని హెచ్చరించారు. ఇటీవల యువతకు చట్టసభల్లో అవకాశాలు కల్పించాలని ప్రకటించిన ప్రభుత్వం, అదే యువతను ఇప్పుడు అవమానించేలా మాట్లాడటం పరస్పర విరుద్ధమైన వైఖరికి నిదర్శనమని విమర్శించారు. దేశంలోనే అతిపెద్ద సమాచార సాంకేతిక కేంద్రంగా హైదరాబాద్ ఎదగడంలో తెలంగాణ ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రతిభ కీలక పాత్ర పోషించిందన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ దూరదృష్టి వల్ల సమాచార సాంకేతిక రంగం విస్తరించి, సుమారు రెండున్నర లక్షల ఉద్యోగాల నుంచి పది లక్షలకు పైగా ఉద్యోగాలు పెరిగాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేయడం తగదని, వెంటనే వాటిని ఉపసంహరించుకుని విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని ఏనుగుల రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు.

# పింగిళి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ‘దోస్త్’ ప్రత్యేక దశ ప్రవేశాలు ప్రారంభం

- ఆగస్టు 6 నుంచి 11 వరకు నమోదు..
- విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కరపత్రం ప్రతినిధి హనుమకొండ, ఆగస్టు 3
హనుమకొండ జిల్లా వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రవేశాల కోసం ‘దోస్త్’ ప్రత్యేక దశ (స్పెషల్ డ్రైవ్ ఫేజ్) ప్రవేశ ప్రక్రియ ప్రారంభం కానుందని కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి తెలిపారు. ప్రత్యేక దశలో నమోదు ప్రక్రియ ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు కొనసాగుతుందని, వెబ్ ఎంపికలు (వెబ్ ఆప్షన్లు) ఆగస్టు 6 నుంచి 12 వరకు నమోదు చేసుకోవచ్చని వెల్లడించారు. సీట్ల కేటాయింపు ఆగస్టు 14న జరుగుతుందని తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఆగస్టు 14 నుంచి 18 వరకు ఆన్‌లైన్‌లో స్వీయ నివేదిక (సెల్ఫ్ రిపోర్టింగ్) పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఆగస్టు 17, 18 తేదీల్లో కళాశాలకు స్వయంగా హాజరై కళాశాల నివేదిక (కాలేజీ రిపోర్టింగ్) తప్పనిసరిగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.
ఇప్పటివరకు ఏ డిగ్రీ కళాశాలలోనూ ప్రవేశం పొందని ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు




ఈ ప్రత్యేక అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. పింగిళి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.ఏ. (తెలుగు, ఆంగ్ల మాధ్యమం), బి.కాం కంప్యూటర్స్ (ఆంగ్ల మాధ్యమం), బి.కాం బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (ఆంగ్ల మాధ్యమం), బి.బి.ఏ. (ఆంగ్ల మాధ్యమం), బి.ఎస్‌సి ఫిజికల్ సైన్సెస్ (ఆంగ్ల మాధ్యమం), బి.ఎస్‌సి లైఫ్ సైన్సెస్ (ఆంగ్ల మాధ్యమం), బి.ఎస్‌సి హెల్త్ కేర్, బి.ఎస్‌సి డెయిరీ అండ్ పౌల్ట్రీ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.